అయ్యో పాపం!



రైలు పట్టాలపై మృత శిశువు

అంతర్వేదిలో సప్తనదీ జ్యేష్ఠాభిషేక మహోత్సవం 5

సార్వత్రిక ఎన్నికలు అయిపోయాయి.. గెలిచిన పార్టీ అధికారం చేపట్టింది.. తాజాగా శుక్రవారం ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం కూడా చేశారు. అయితే నాడు ఎన్నికల్లో పనిచేసిన పలువురికి రెమ్యునరేషన్ మాత్రం ఇంకా చెల్లించలేదు.. దీంతో వారంతా ఆందోళనకు దిగుతున్నారు.. శుక్రవారం ఫొటోగ్రాఫర్స్ కలెక్టరేట్‌ను ముట్టడించారు.. కడియం మండలంలో బీఎల్‌వోలు తమ రెమ్యునరేషన్‌ను చెల్లించాలంటూ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఎన్నికల బకాయిలివ్వాలని ధర్నా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 21 : సార్వత్రిక ఎన్నికలు 2024 ముగిసినా రెమ్యునరేషన్ చెల్లించకపోవడంపై కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 248 మంది ఫొటోగ్రాఫర్లు 58 రోజుల పాటు పనిచేశారు. అయితే కొంత మొత్తం చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించాలని ధర్నా చేశారు.దీనిపై స్పందించిన కలెక్టర్ మాధవీలత ఫొటోగ్రాఫర్లకు రావాల్సిన బకాయిలను ఈ నెల 29వ తేదీలోగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో అసోసియేషన్ అధ్యక్షుడు బాబీ,సిరి శ్రీను,కోనే శ్రీను, దొమ్మేటి రవికుమార్ పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ ఇప్పించాలని బీఎల్‌వోల వినతి



కడియం, జూన్ 21 : కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న బూత్ లెవెల్ ఆఫీసర్స్(బీఎల్‌వో)ల రెమ్యునరేషన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎల్‌వోలు శుక్రవారం కడియం తహశీల్దార్ బి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నిమిత్తం ఎంతో కష్టించి పనిచేశామని, అయినా రెమ్యునరేషన్ ఇంకా రాలేదని బీఎల్‌వోలు వాపోయారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు కాదంబరి సూర్య శ్రీనివాస్, బండారు మహేష్, తాడాల సత్యనారాయణ, తూర్పూరి ప్రశంస, దేగల పాపారాయుడు,సాదే నాగమల్లి, డేనియల్ బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఒక్క డయేరియా కేసు నమోదు కాకూడదు

కలెక్టర్ మాధవీలత



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 21 : జిల్లాలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫ రెన్స్‌లో సమీ క్షించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో అవగాహన కలిగించేందుకు డయేరియాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రెండు వారాల కార్యాచరణ అమలు చేయాల్సి ఉందన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ డయేరియా నియంత్రణపై జిల్లాస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతున్నామన్నారు. డయేరియా కేసులు నమోదు కాకుండా తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ స్థాయి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, డీఐవో డాక్టర్ రాజకుమారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఉపయోగమే!

బం చిక్ బం బం చేయి బాగా.. ఒంటికి యోగా మంచిదేగా.. అవును మరి ఆసనాల్లోనే ఆరోగ్యం.. ఆందోళనగా ఉన్నా.. ఆకలి లేకున్నా.. ఆయాసంగా ఉన్నా.. ఒంట్లో ఏ రోగం ఉన్నా ఆసనంతో సరి.. అందుకే యోగాకు అంత ప్రాముఖ్యత.. ప్రస్తుతం పాఠశాలల్లోనూ యోగా క్లాసులు ప్రత్యేకంగా చెప్పిస్తున్నారంటే ఎంత ఉపయోగమే అర్థం చేసుకోవాల్సిందే.. అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం పండుగలా చేశారు.. విద్యార్థులు.. ఉన్నతాధికారులు.. న్యాయమూర్తులు.. న్యాయవాదులు ఇలా ఒకరేమిటి అన్ని వర్గాలు యోగా బాటపట్టారు.. బిక్కవోలు పాఠశాలలో విద్యార్థులు.. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జేకే గార్డెన్స్‌లో అధికారుల యోగాసనాలు చిత్రాల్లో చూడవచ్చు. - 6లో

అసెంబ్లీ ఆనందం





- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- జిల్లా నుంచి ఆరుగురు
- రంపచోడవరం నుంచి ఒకరు
- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- దైవసాక్షిగా అంటూ ప్రమాణం
- ఒకరికొకరు అభినందనలు
- నియోజకవర్గాల్లో సంబరం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కల ఫలించింది..ఆ ఆనందం మాటల్లో కనిపించింది.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నాయకులు శుక్రవారం అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టారు.ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆయా ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. తెలుగుదేశం- జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం మొదలైన సంగతి తెలిసిందే.రెండు రోజుల పాటు ఇవి జరుగుతాయి. ఈ రెండు రోజులు ప్రొటెం స్పీకర్‌గా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యవహరిస్తున్నారు.ఆయన ఇప్పటి వరకూ ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో సీనియర్‌గా ఆయనకు ప్రొటెం స్పీకర్‌గా గౌరవం దక్కింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తొలి విజయాన్ని కూటమికి అందించి విజేతగా నిలిచిన గోరంట్ల ప్రథమ విజేతగా నిలిచారు. ఇప్పుడు ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ స్థానం అధిరోహించిన బుచ్చయ్యచౌదరికి ఎమ్మెల్యేలంతా అభినందనలు తెలిపారు. శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన 172 మంది ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి వద్దకు వెళ్లి అభివాదం చేశారు. ఆయన కూడా ప్రతి అభివాదం చేశారు. దీంతో మొత్తం ఎమ్మెల్యేలందరితో మాట్లాడే అవకాశం గోరంట్లకు దక్కింది. కొందరు ఆయనకు పాదాభివందనం కూడా చేశారు. కొందరు మహిళలను ఆయన ఆశీర్వదించారు.జిల్లాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా ఉండడం వల్ల బుధవారం ఆయన చేత గవర్నర్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. మిగతా ఆరుగురితో గోరంట్ల చేయించారు.రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాత్రం పవిత్రహృదయంతో అని చెబుతూ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక వీరంతా ఇక ఎమ్మెల్యేలే.. వైసీపీ వాళ్లంతా తాజా మాజీ లైపోయారు. జిల్లాలో కూటమికి చెందిన వారే అందరూ కావడం గమనార్హం. అందులో టీడీపీ తరపున నలుగురు, జనసేన నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఉన్న సంగతి తెలిసిందే. ఇక తమ నియోజకవర్గాలకు వచ్చి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టనున్నారు. నాయకుల ప్రమాణస్వీకారం పూర్తయిన వెంటనే ఆయా నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. చాలా మంది టీవీలలో ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్లలో అభినందనలు తెలుపుతూ పోస్టులు పెట్టారు.

24,25న ఐటీఐ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24,25 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. జీపీఏ 10-7, 1-136 ర్యాంకు విద్యార్థులకు 24న ఉదయం 9 గంటలకు,జీపీఏ 6.8-5.7 ర్యాంకు 137-270 విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు, జీపీఏ 5.7-4.7 ర్యాంకు 271-405 వరకూ జూన్ 25న ఉదయం 9 గంటలకు,జీపీఏ 4.7-1.6, 406-543 ర్యాంకు విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఎలాంటి ఫోన్‌కాల్స్ మెసేజ్‌లు రాని అభ్యర్థులు పదో తరగతి గ్రేడ్ పాయింట్ల ప్రకారం ఆయా తేదీల్లోని నిర్దేశిత సమయాల్లో సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావచ్చని కృష్ణన్ తెలిపారు.



కళాశాలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

కొవ్వూరు, జూన్ 21 : కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జోన్-2 ప్రాంతీయ ఉప సంచాలకులు శోభారాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల అధ్యాపకులతో అకడమిక్‌కు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. అకడమిక్, కార్యాలయానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కళాశాల అభివృద్ధికి సంబంధించి సూచనలు,సలహాలు అందజేశారు.



అనే నేను

కందుల దుర్గేష్ నిడదవోలు | ఆదిరెడ్డి శ్రీనివాసు రాజమహేంద్రవరం సిటీ | బత్తుల బలరామకృష్ణ రాజానగరం | ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు | మద్దిపాటి వెంకటరాజు గోపాలపురం | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి | మిరియాల శిరీషాదేవి రంపచోడవరం

బూమ్ బూమ్ .. ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్, హార్సెస్, ఓషన్ బ్లూ.. ఇలా రకరకాల పేర్లతో జగన్ గుంపు నాసిరకం మద్యం జనాల ప్రాణాలు తీసింది. మన రాష్ట్రంలో దొరికే మందు దేశంలో మరెక్కడా లభ్యమయ్యేది కాదు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లు అక్కడి నుంచి మద్యం తెచ్చుకొనే పరిస్థితి ఉండేది. దీనికి కారణం 'జే' బ్రాండ్లు. ఏది అమ్మితే అదే తాగాలనే దందా సాగింది.. మద్యం అలవాటు ఉన్నవారు ఎక్కువగా ఇష్టపడే బ్రాండ్లను ఆపేశారు. అదే సమయంలో ధరలను రెండింతలు పెంచేశారు. ఎంత చెల్లించినా నాణ్యమైన సరుకు గగనమైపోయింది. దీంతో మందుబాబులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంచేపట్టడంతో జే బ్రాండ్లకు బై బై చెబుతున్నారు.. నాణ్యత కలిగిన మద్యం బ్రాండ్లకు జైకొడుతున్నారు.

బై..బై జే బ్రాండ్స్!



జగన్ 'బూమ్ బూమ్'కు బైబై

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మందుబాబులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజులు త్వరలోనే రానున్నాయి.. ఐదేళ్లుగా 'జే' బ్రాండ్లతో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్నారు.. నాణ్యమైన చుక్క పడి ఏన్నాళ్లయ్యిందో. వైసీపీ పెద్దల కమీషన్ల దెబ్బకు ఎంసీ, సీయాగ్రామ్స్ వంటి అంతర్జాతీయ కంపెనీలు సైతం కనుచూపు మేరలో కనిపించకుండా పరుగు పెట్టాయి. బడ్వయిజర్, నాకవుట్ వంటి ఆదరణ కలిగిన బీర్లు కనుమరుగయ్యాయి. మద్యం తయారీ కంపెనీలను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని నాసిరకం మద్యాన్ని తయారు చేసి దానిని ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయాలు జరిపేవాళ్లు.వాటిలో ప్రజల ఆరోగ్యాన్ని తినేసే రసాయనాలు ఉన్నాయని గగ్గోలు పెట్టినా జగన్‌కి పట్టింపు లేకుండాపోయింది. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో త్వరలోనే అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి.ఈ మేరకు 'జే' బ్రాండ్ల కొనుగోలును ఏపీఎస్‌బీసీఎల్ ఆపేసిందని తెలుస్తోంది.

మారనున్న మద్యం పాలసీ..

గతంలో టీడీపీ ప్రభుత్వం(2019కి ముందు) ఉన్న సమయంలో మద్యం పాలసీ పద్ధతి ప్రకారం నడిచేది. లైసెన్సు విధానంలో ప్రైవేటు షాపులకు అనుమతులు ఇవ్వడం జరిగేది. మద్యం ఎంఆర్పీ ధరపై వ్యాపారులకు ప్రభుత్వమే 15 శాతం వరకూ చెల్లించేది. దీంతో ఒక్క పైసా అదనంగా తీసుకోడానికి వీలుండేది కాదు. వైసీపీ ప్రభుత్వంలో దానిని రద్దు చేసి.. ఎంతకైనా విక్రయించుకోవచ్చనే వికృత జీవోను విడుదల చేసింది. ప్రభుత్వ మద్యం దుకాణాలంటూ వైసీపీ మద్యం మాఫియాకు ఊతమిచ్చింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పాత విధానాన్నే అమల్లోకి తేవడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తేయబోతున్నారని తెలుస్తోంది.ప్రైవేటు మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయిస్తారనే చర్చ నడుస్తోంది.ఆశావహులు ఆ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నారు.

ఇకనైనా బెల్ట్ తీస్తారా?

మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెంపుపై తీవ్రంగా దృష్టి సారించిన వైసీపీ ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖపై బాగా ఒత్తిడి పెంచింది. తద్వారా జనాలతో పూటుగా నాసిరకం మందు తాగించింది. 19 మండలాల్లో 158 మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్‌ఇన్ స్టోర్స్‌ని తెరపైకి తెచ్చింది. వాటికి బెల్టుషాపులు జతకలిశాయి.టీడీపీ ప్రభుత్వ హయాంలో మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ జగన్ మాత్రం గడప గడపకూ మందు అందాలన్నదే లక్ష్యంగా మద్యం పాలసీ చేశారు. నివాసాల మధ్యనే మద్యం షాపులు పెట్టారు. మద్యం అమ్మకానికి వీలైన ఏ ఒక్క అవకాశాన్నీ జగన్ వదల్లేదు. వీధికో బెల్టుషాపు పుట్టుకొచ్చింది. చివరికి చీప్ లిక్కర్ ధరను అమాంతం రూ.150 చేసేశారు. టీడీపీ హయాంలో నాణ్యమైన చీప్ లిక్కర్ రూ.60కే దొరికేది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బెల్టుషాపులపై యంత్రాంగం బెల్టు తీయనుంది. జగన్ ఆర్భాటంగా తీసుకొచ్చిన (సెబ్)ని కూడా సెటరైట్ చేసి ఎక్సైజ్ శాఖను పూర్తిస్థాయిలో పునరుద్ధరణ చేస్తారని తెలుస్తోంది.

ఉందిలే..మందుకాలం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్జాతీయ కంపెనీలు తయారు చేసే ఎంసీ విస్కీ, బ్రాంది, ఇపీరియల్ బ్లూ(ఐబీ), ఓసీ ఒరిజినల్, ఏసీ బ్లాక్ ఒరిజినల్,మెన్స్‌క్లబ్, డైరెక్టర్ స్పెషల్(డీఎస్పీ), ఏసీ ప్రీమియం, అరిస్టోక్రాట్ ప్రీమియం, వీఎస్ఓపీ వంటి బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. అయితే దీనికి కొద్దిగా సమయం పట్టే అవకాశం ఉంది. అధికారులు, అమాత్యులు, ప్రభుత్వం కుదురుకోవాల్సి ఉంది. ఇంకా కొందరు మంత్రులు బాధ్యతలు స్వీకరించలేదు. అలాగే క్యాబినెట్ సమావేశం జరగలేదు. ఇవన్నీ అయిన తర్వాత ఎక్సైజ్ పాలసీలపై చంద్రబాబు సమీక్ష చేస్తారని చెబు తున్నారు. ప్రస్తుతం ఉన్న బార్లుకు అనుమతులు ఇంకా సుమారు ఏడాదిన్నర ఉన్నాయి. ప్రభుత్వం మద్యం షాపుల లైసెన్సు సెప్టెంబరు నెలాఖరు వరకూ ఉంది. దీంతో మద్యం పాలసీలను సమీక్షించాల్సి ఉంది. అయితే దానికంటే ముందే నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కసరత్తు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే తయారీ కేంద్రాల నుంచి పిచ్చి బ్రాండ్ల కొనుగోలు నిలిపివేశారు.జిల్లాలో 137 ప్రభుత్వం మద్యం షాపులు,20 బార్లు ఉన్నాయి. వీటికి రాజమండ్రిలోని ఏపీఎస్‌బీసీఎల్ డిపో నుంచి మద్యం సరఫరా చేస్తారు. అయితే ఈ డిపోకి బూమ్‌బూమ్, బ్లాక్‌బస్టర్ బీర్లు, గోల్డెన్ కింగ్, దారుహౌస్, ఆంధ్రాగోల్డ్, సుప్రీం, లీలా (వైసీపీ విజయ సాయిరెడ్డి కంపెనీ అని చెబుతారు) వంటి బ్రాండ్లను సరఫరా చేయడం ఇప్పటికే నిలిపివేశారు. డిపోలో స్టాకు ఉన్నంత వరకూ దుకాణాలకు పంపిస్తున్నారు. తయారీ కంపెనీల నుంచి కొత్తగా ఈ బ్రాండ్లు డిపోకు రావడం లేదు. అలాగే ధరలపై కూడా పునఃసమీక్ష చేయనున్నారు. చీప్ లిక్కర్ కూడా నాసిరకం పోయి నాణ్యమైనది రానుంది.

- జగన్ బ్రాండ్లకు మంగళం
- డిపోలకు రవాణా నిలిపివేత
- త్వరలో నాణ్యమైన సరుకు
- మళ్లీ అంతర్జాతీయ బ్రాండ్లు
- జిల్లాలో 158 మద్యం దుకాణాలు
- బెల్ట్ షాపుల జోరు
- పాత మద్యం పాలసీ తెచ్చే అవకాశం
- కూటమి ప్రభుత్వ నిర్ణయం
- ప్రైవేటు లైసెన్స్‌లకు ఎదురుచూపులు



కంబాలచెరువులో మృతిచెందిన చేపలు

కంబాలచెరువులో చేపల పెంపకమా!?

పలు రకాల చేపల మృతితో కంపుకొడుతున్న పార్కు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21 : ప్రవేశరుసుంపై ఉన్న శ్రద్ధ.. నిర్వహణపై లేదు..దీంతో రాజమహేంద్రవరం కంబాలచెరువు కంపుకొడుతోంది. సరదాగా సేదతీరడానికి కంబాలచెరువు పార్కుకు వచ్చిన వారి ముక్కులు పగిలేలా దుర్వాసన వస్తోంది. చేపలు గురువారం రాత్రి చనిపోయి నీటిపై తేలి శుక్రవారం ఉదయానికి కంపుకొట్టాయి. కంబాలచెరువులోకి చేపలు ఎలా వచ్చాయో తెలియదు కానీ.. అవి చనిపోయి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కంబాలచెరువులో మురుగునీరే ఉంటుంది.సాధారణంగా దోమలు గుడ్లను తినడానికి గంబూషియా చేప పిల్లలను చెరువులో వేస్తారు. కానీ కంబాలచెరువులో జెల్లలు, ఇతర చేపలు కూడా ఎలా పెరిగాయో అర్థంకాని పరిస్థితిగా ఉంది. కంబాలచెరువు పార్కు నిర్వహణ బాధ్యతలు గత ప్రభుత్వంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు.ప్రజాధనంతో పార్కును అభి వృద్ధి చేసి ఒక్కొక్కరికీ రూ.30ల ప్రవేశ టిక్కెట్టు పెట్టారు. లోపల ఉన్న స్కై సైకిలింగ్,రోలింగ్ వివిధ పరికరాలతో పిల్లలను అలరించే వాటికి ఒక్కొక్క దానికి సపరేటు ధరలు నిర్ణయించారు.డబ్బులపై ఉన్న శ్రద్ధ కం బాలచెరువు నిర్వహణపై లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేపలు పెంచేదెవరు?

కంబాలచెరువులో వేలాదిగా చేపలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ చెరువులోకి ఉంటే గంబూషియా చేపలు ఉండాలి తప్ప చేపలు ఎలా వచ్చాయనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిగా డ్రైనేజీ వాటర్‌తో నిండిన చెరువులోకి చేపలు ఎలా వచ్చాయో నిర్వాహకులకే తెలియాలి. గత ఐదేళ్లుగా కంబాలచెరువులో చేపలను ఎవరికీ తెలియకుండా పెంచుతున్నారా? అనే అనుమానాలున్నాయి. చెరువులో తేలిన చేపల్లో జల్లలు, మోసు, గడ్డి చేపలు ఉండడం గమనార్హం.

'సభా' సందడి!

అందరూ ఎదురుచూస్తున్న అసెంబ్లీ కొలువుదీరింది. తొలి సభలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారాలు నిర్వహించారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాలు చేయగా, సభ అంతా సందడి నెలకొంది. ఎవరు ఎలా ప్రమాణ స్వీకారం చేస్తారోనని అందరూ ఆసక్తిగా గమనించారు. అలాగే శాసన సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను కలవడానికి కూటమి ఎమ్మెల్యేలంతా పోటీపడ్డారు. సభలో కనిపించిన దృశ్యాలివి..

» తొలిరోజు ప్రమాణ స్వీకారోత్సవ సంబరం » ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ గోరంట్ల » చంద్రబాబు, పవన్, లోకేశ్‌లను కలిసేందుకు ఉత్సాహం






శాసనసభలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ



పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్, నిమ్మకాయల చినరాజప్ప







శాసనసభలో తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులైన ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, దేవ వరప్రసాద్, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ తదితరులు




హతమార్చిన రక్తపింజర పాము.. మహిళ మృతదేహం

పాముకాటుకు మహిళ మృతి

మామిడికుదురు, జూన్21: మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవకు చెందిన వనమాడి అంజలీదేవి (38) పాముకాటుకు గురై మృతిచెందినట్టు నగరం ఎస్ఐ వి.సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు అంజలీదేవి గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో తన ఇంటి వద్ద వాకిలి తుడుచుకుంటుండగా రక్తపింజర పాము కాటువేసింది. స్థానికులు పామును హతమార్చి, పాముకాటుకు గురైన మహిళను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏజెన్సీలో పాముకాటుకు వ్యక్తి మృతి



పాముకాటుకు మృతి చెందిన బాబూరావు

రాజవొమ్మంగి జూన్ 21: రాజవొమ్మంగి గ్రామంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పాతాళ బాబూరావు (45) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి పాముకాటుకు గురై మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబూరావు శుక్రవారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పొలంగట్టుపై పాము కాటువేయడంతో హుటాహుటీన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబీకులు రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాబూరావు మృతి చెందాడని వైద్యాధికారి సుష్మ వెల్లడించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు.

రైలు పట్టాలపై ఆడ శిశువు మృతదేహం



నిడదవోలు, జూన్21: పుట్టి పదిహేను రోజులైనా నిండని శిశువు మృతదేహం అనుమానాస్పదంగా రైలు పట్టాలపై ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఎవరైనా కఠినాత్ములు ఆడపిల్ల పుట్టిందని రైలు పట్టాలపై వదిలేశారా లేక చనిపోయిన ఆడ శిశువును తెచ్చి పట్టాలపై వదిలేశారా అనేది చర్చనీయాంశమైంది. నిడదవోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న యార్డ్ వద్ద శుక్రవారం రైలు పట్టాలపై పదిహేను రోజులలోపు వయసున్న గుర్తుతెలియని ఆడశిశువు మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు గుర్తించారు. మృత శిశువును పసుపు తెలుపు బొమ్మల డిజైన్ ఉన్న బేబీ కేరింగ్ కవర్‌లో ఉంచారని ఎరుపురంగు చున్నీ చుట్టూ చుట్టి ఉందని, పింక్ కలర్ జుబ్బా వేసి ఉందని చెప్పారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతశిశువును గుర్తించినవారు 9490617090, 7013360296 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలమూరు, జూన్ 21: మండలంలోని చెముడులంక 216 (ఎ) జాతీయ రహదారిపై ధనలక్ష్మమ్మ ఆలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గళ్లా సుబ్బారావు (56) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు రైతువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పట్లాగే పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో చెముడులంక కూడలి వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

25న గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ఈనెల 25న జరుగుతుందని జిల్లా సమన్వయకర్త వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న ప్రవేశ పరీక్షలు సంబంధిత పాఠశాలలో జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు చేరాలనుకునే పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేయాలన్నారు. ప్రధానంగా 6 తరగతి నుంచి 9 తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారమే అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లాలో ప్రవేశాలు జరుగుతాయని సమన్వయకర్త వెంకటరావు తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

కాజులూరు మండలంలో విజిలెన్స్ దాడులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్నారనే సమాచారంతో రాజమండ్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం కోలంక గ్రామ సమీపంలో టాటా వాహనం తనిఖీ చేయగా అక్రమంగా డీజిల్ తరలిస్తున్నట్టు గుర్తించారు. 16 డ్రమ్ముల్లో 3200 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. వాహన యజమాని జొజ్జవరపు శ్రీనివాస్ ఆదేశాల మేరకు డ్రైవర్ కోరుకొండ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఈ డీజిల్ విలువ రూ.12,68,800 ఉంటుందని పేర్కొన్నారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌కు సిఫారసు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పెట్రోల్ ఉత్పత్తుల అక్రమ నిల్వలపై దాడులు జరుగుతున్నాయి. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, కిషోర్, శివ, లక్ష్మీప్రసన్న, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.



వైద్య బృందంతో పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

వేట్లపాలెంలో డయేరియా బాధితులు

» విరేచనాలతో 13 మందికి చికిత్స
» కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ముగ్గురు తరలింపు
» మరో పది మందికి పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స

సామర్లకోట, జూన్ 21: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శుక్రవారం పలువురు విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో జొన్నలదొడ్డి ప్రాంతంలో సుమారు 13 మంది విరేచనాలకు గురికాగా, వారిలో ముగ్గురికి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు అంబులెన్స్‌లలో తరలించారు. ఏడుగురికి వేట్లపాలెం పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ పరదేశి ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్నారు. మరో పదిమంది విరేచనాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరినట్టు కుటుంబవర్గాల ద్వారా తెలిసింది. కాగా గ్రామంలో పలువురికి విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురైన సంఘటనపై అధికారులు ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన వేట్లపాలెం వైద్యబృందం జొన్నలదొడ్డి ప్రాంతంతోపాటు గ్రామంలో ఇంటింటా పర్యటించి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. విరేచనాలు వంటి లక్షణాలు కలిగిన పలువురిని గుర్తించి టాబ్లెట్‌లను అందించారు. అలాగే గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలిందన్న సమాచారంతో సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవో పీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి తదితర పంచాయతీ సిబ్బంది గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌లను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకులను గుర్తించి అరికట్టాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. కాగా గ్రామంలో డయేరియా ఏవిధంగా ప్రబలింది, ఆహారం విషయంలో ప్రజలు ఏమేమి జాగ్రత్తలు తీసుకున్నారనే అంశాలపై ఎంపీడీవో శ్యామ్ సుందర్ ఆరా తీశారు. జిల్లా వైద్యఆరోగ్య ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రత్యేక ఆదేశాల మేరకు గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చేవరకూ వైద్యఆరోగ్య సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాగా రాజధాని అమరావతి సచివాలయంలో శుక్రవారం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఉన్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వేట్లపాలెం గ్రామంలో పలువురు డయేరియా బారిన పడినట్లు సమాచారం తెలిసి సత్వరం స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులకు రాజధాని నుంచి ఫోన్ చేసి సమాచారాన్ని సేకరించారు. పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

డయేరియా బారినపడినవారు వీరే..

కొమ్మోజు సత్యవేణి, పరిమి స్రవంతి, పైలా అక్షయ్‌లను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాలకుర్తి జ్యోతి, బిక్కిన భవాని, వడ్డాది పెద్దరాజు, వడ్డాది అప్పారావు, బంగారు హరిచరణ్, పరిమి దివ్య, వడ్డాది వెంకటచరణ్, వడ్డాది రామయ్య, బడేటి వెంకటేష్, బడేటి సుభాష్, వడ్డాది గన్నివర్ధన్, అభిషేక్, మానస, మనుపర్తి వేగేశ్వరరావు చికిత్స పొందుతున్నారు.

బెండపూడిలో ఏడు డయేరియా కేసుల నమోదు

తొండంగి, జూన్ 21: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామంలో శుక్రవారం ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీటిలో నాలుగు కేసులకు స్థానికంగా చికిత్స అందించి మిగిలిన మూడు కేసులను కాకినాడ రిఫర్ చేశారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత ఈ కేంద్రాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. మరోవైపు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



రాయవరంలో అవయవ దానంపై రూపొందించిన ప్రాజెక్టు

అగ్గిపుల్లలతో అవయవదానంపై ప్రాజెక్టు

ఆకట్టుకున్న రాయవరం విద్యార్థినుల ప్రతిభ

రాయవరం, జూన్ 21: అవయవ దానం మహాదానం అంటూ అవగాహన కల్పిస్తూ రాయవరం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు 1 లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో చేసిన కొలాజ్ ఆర్ట్ ద్వారా తయారు ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయవరం గ్రామంలో నివాసం ఉంటున్న మల్లిడి స్వర్ణలత మండపేట ఆదిత్య కాలేజ్‌లో ఇంటర్ చదువుతోంది. ఆమె సోదరి వైష్ణవి రాయవరం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. అనపర్తి మండలం రామవరం హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మందపల్లి సత్యానందం ఆధ్వర్యంలో స్వర్ణలత, వైష్ణవి 1లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో సుమారు 2వేల 700 అగ్గిపెట్టెలు ఉపయోగించి 30 రోజులపాటు శ్రమించి మానవ శరీరంలో ఉండే ముఖ్యమైన అవయవాలను కొలాజ్ ఆర్ట్ ద్వారా 15 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పుతో ప్రాజెక్టును తయారుచేశారు. వరల్డ్ రికార్డు తమ ప్రాజెక్టు పంపనున్నట్టు విద్యార్థినులు తెలిపారు. ఈ ప్రాజెక్టును రామచంద్రపురం డీవైఈవో నరసింహపాణి, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ సందర్శించారు. ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థినిలను, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యానందంను డీవైఈవో, ఎంఈవోలు, హెచ్ఎం శాంతి సునీత అభినందించారు.




యోగాసనం వేసిన పీడీజే గంధం సునీత తదితరులు.. సెంట్రల్ జైలులో యోగాసనాలు వేసిన అధికారులు, ఖైదీలు

జీవన శైలిలో యోగా భాగం కావాలి

రాజమహేంద్రవరంలో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మన జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని, శారీరక మానసిక శ్రేయస్సును మెరుగు పరిచే ఒక అభ్యాసం యోగా అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగాసనాలను వేశారు. యోగాలో పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను యోగా శిక్షకుడు శ్యామ్ వివరించారు. అలాగే సెంట్రల్ జైలులో అధికారులు, ఖైదీలు యోగాసనాలు వేశారు. ప్రతి రోజూ ఉదయం ఖైదీలు యోగాతో తమ దైనందిన జీవనాన్ని ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగా భారతి ట్రస్టు గురువులు అల్లు సత్యనారాయణ, నవీన.. యోగ, ధ్యానం చేయించిన అనంతరం అష్టాంగ యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజ్‌కుమార్, బి.రత్నరాజు, జైలర్లు కెవీ రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేశ్, సీహెచ్ రమేశ్‌లు పాల్గొన్నారు.



సప్త నదీ జలాలకు అర్చకుల పూజలు

అంతర్వేదిలో ఘనంగా సప్తనదీ జ్యేష్ఠాభిషేక మహోత్సవం

వైభవంగా మహాశాంతి హోమం



హోమంలో పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్21: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠా నక్షత్ర పర్వదినం సందర్భంగా శ్రీస్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. తొలుత అర్చకులు శిరస్సుపై సప్తనదీ జలాలు ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామివారికి తొలుత పంచామృతాభిషేకం నిర్వహించి, సప్తనదులైన గంగా, యమునా, సరస్వతి, నర్మదా, గోదావరి, సింధు, కావేరి పవిత్ర గోదావరి జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్య, సహ అర్చకులు, వేదపండితులచే అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షారాధన, చతుర్దశ కలశారాధన, నవకలశారాధన, పంచామృత కలశారాధన, సప్తనదీ కలశ ఆవాహనులు, ఆరాధనలు, విశేష అర్చనలు, అగ్నిమథనం, అగ్నిహోత్రాలతో ప్రత్యేక పూజల అనంతరం సప్త నదీజలాలతో, చతుర్దశ కలశాలతోను స్వామివారి మూలవరులకు మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశాంతి హోమం వైభవంగా నిర్వహించి పూర్ణాహుతిలో భాగంగా పూజా ద్రవ్యాలను హోమంలో వేసి పూజా కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, జలాభిషేక ద్రవ్యాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారామగోపాలరాజా బహదూర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం



శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

అసెంబ్లీకి శిరీషా.. ఏజెన్సీలో సంబరాలు

రాజవొమ్మంగి జూన్ 21: రాజవొమ్మంగి మండలానికి చెందిన యువతి మొదటిసారి ఎమ్మెల్యేగా ఆసెంబ్లీలో శుక్రవారం అడుగుపెట్టిన సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. రాజవొమ్మంగి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన మిరియాల శిరీషాదేవి శుక్రవారం ఆసెంబ్లీలో రంపచోడవరం శాసనసభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మండల వ్యాప్తంగా శుక్రవారం అనేక గ్రామల్లో కూటమి నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి ఆనందాన్ని గ్రామస్తులతో పంచుకున్నారు. రాజవొమ్మంగి గ్రామంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో శుక్రవారం రాత్రి కూటమి నేతల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో గాంధీబొమ్మ సెంటర్ కోలహలంగా మారింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, జెడ్పీటీసీ వడుగుల జ్యోతి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



వై.రామవరంలో స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారోత్సవం.. స్వీట్లు పంపిణీ

వై.రామవరం, జూన్21: రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన మిరియాల శిరీషాదేవి శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా వై.రామవరం మండలంలోని ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల నాయకులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అసెంబ్లీలో తొలిసారిగా అడుగుపెడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, తొలిసారిగా అడుగుపెట్టిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అభినందనలు తెలుపుతూ పార్టీ శ్రేణులు ఆనందోత్సావాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, కార్యకర్తలు, నాయకులు మడకం రామలక్ష్మి, గిరిబాల సాంబయ్య, కుప్ప శ్రీను, బీజేపీ నాయకులు పల్లాల పండురెడ్డి, జనసేన నాయకులు పుష్పరాజు, కృష్ణారెడ్డి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



యోగా డే సందర్భంగా యోగా చేస్తున్న దృశ్యం

'తనువు, మనస్సును ఏకంచేసేదే యోగా'

డొంకరాయి సీఆర్పీఎఫ్ మైదానంలో యోగా దినోత్సవం

మోతుగూడెం, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం 2024ను పురస్కరించుకుని శుక్రవారం డొంకరాయి సీఆర్పీఎఫ్ మైదానంలో బీ/42 సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్‌సింగ్, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో బీ/42 సీఆర్పీఎఫ్, డొంకరాయి పీఎస్ పోలీసులు, జడ్పీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులతో యోగా డే జరిపారు. ఈ సందర్భంగా బీ/42 సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ సింగ్, డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం పలు రకాల విధులు నిర్వహిస్తున్నప్పటికీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకం అన్నారు. పోలీసులు నిత్యం ఒత్తిడితో కూడుకున్న విధుల్లో నిమగ్నమై ఉంటారని, ఈ మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం 15 నిమిషాలపాటు యోగాను చేయడం వల్ల తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు శరీర సౌష్టవం, ఒత్తిడి నుంచి విముక్తి, మెరుగైన రక్తప్రసరణ వంటి ఫలితాలు పొందవచ్చని వారు పేర్కొన్నారు.

వై రామవరంలో ఘనంగా యోగా దినోత్సవం

వై.రామవరం, జూన్21: వై.రామవరంలో మంగళవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు యోగా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో పీడీ మంగాయమ్మ విద్యార్థులతో పలు యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ రాజామణి

విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

దేవీపట్నం, జూన్21: మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులగూడెం మంటూరు ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం విద్యార్థులు 76 మందికి దేవిపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, మంటూరు సర్పంచ్ నాగరత్నం శుక్రవారం పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఏనుగులగూడెం ఎంపీపీ స్కూల్ హెచ్ఎం వి.ముత్యాలరెడ్డి, మంటూరు హెచ్ఎం డి.అబ్బాయిరెడ్డి, అగ్రహారం హెచ్ఎం ఎస్.యర్రంరెడ్డి, ఉపాధ్యాయులు టి.రాజశేఖర్‌దొర, పి.రాంబాబు, జి.హరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

దేవీపట్నం, జూన్ 21: విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నాగార్జున విద్యార్థుల కు అవగాహన కల్పించారు. మండలంలోని ఇందుకూరుపేట హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఎస్ఐ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థుల దృష్టంతా చదువుపైనే ఉండాలని క్రీడలు ఆడుతూ మానసికోల్లాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో గంజాయి, సిగరెట్, మద్యం వంటి జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వివరించారు.



దివాన్‌చెరువు: నన్నయ వర్సిటీలో యోగాసనాలు వేస్తున్న వీసీ, అధికారులు, విద్యార్థులు



కడియంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో మానసిక ఆరోగ్యం

- నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య పద్మరాజు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పలుచోట్ల యోగాసనాలు
- యోగా గురువులకు సత్కారాలు

దివాన్‌చెరువు, జూన్ 21: యోగాతో మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిన యోగా వేదకాలం నుంచే భారతదేశంలో ఉందని, యోగా మూలాలన్నీ భారత్‌లోనే ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనతోనే 2015లో ఐక్యరాజసమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు రోజూ యోగా చేస్తే మెదడు చురుగ్గా పనిచేస్తుందని, జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నో ప్రయోజనాలున్న యోగను అందరూ ఆచరించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ యోగాసనాలు చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. కానవరంలోని శ్రీరాపర్తిరామ యోగా సంస్థ ఆధ్వర్యంలో వర్శిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో వివిధ యోగాసనాలు వేయించారు. యోగాసనాలతో నిర్వహించిన జలదీప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో యోగా సంస్థ ప్రతినిధులు డీఎస్ఎన్ రాజు, ఎంవీజీఎస్ శర్మ, ఎ.శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్స్ పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, యోగా డిప్లమో విద్యార్థులు పాల్గొన్నారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు యోగా ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీవీ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు యోగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులతో యోగా గురువు వి.అరుణ్‌కుమార్, పీడీ ఎస్.వెంకటకుమార్ ఆసనాలు వేయించారు. దివాన్‌చెరువులో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. కరస్పాండెంట్ ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డి, ఛైర్‌పర్సన్ ఎస్.శకుంతల, ప్రిన్సిపాల్ డి.నరేంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కడియం: కడియం హైస్కూల్లో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీశంకర్ విచ్చేశారు. విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన ఉండాలన్నారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, ఎంఈవోలు వైనాగేశ్వరరావు, మణికుమార్, ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, పీడీలు ఎం.డేవిడ్, వీరబాబు పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. యోగా గురువు ఆకుల తాతాజీ యోగా ప్రయోజనాలు, ప్రాముఖ్యతను వివరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, మోసిగంటి సత్యవతి, ఆకుల శ్రీధర్, నాగులపల్లి వీరబాబు, గారపాటి తాతబ్బాయి, మర్రి శంకర్, గ్రీన్‌లాండ్ బాబి పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులోని ఓంశాంతి ఆశ్రమంలో బ్రహ్మకుమారి లక్ష్మి యోగా, ధ్యానం గూర్చి వివరించారు. అనంతరం బ్రహ్మకుమారీలు ఆమెను ఘనంగా సత్కరించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో పీడీ యువరాజారెడ్డి, కొంకుదురు ఉన్నత పాఠశాలలో పీడీ చిక్కా రాజశేఖర్, బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.శ్రీనివాసరెడ్డి, మెళ్లూరులో హెచ్ఎం లక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు.

రాజానగరం: గైట్ కళాశాల ప్రాంగణంలోని పలు కళాశాలల్లో అంతర్జాయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అటానమస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ నిత్యం ప్రతిఒక్కరూ పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, దీని నుంచి ఉపశమనం పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగ గురువు రమణ విద్యార్థులు, బోధన సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి, విభాగ అధిపతి ఎస్.గౌరీరెడ్డి, పీడీ సీఎం హెన్రీ, ఎన్‌సీసీ, ఏఎన్‌వో ఎ.తేజోశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. వెలుగుబందలోని ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హెచ్ఎం ఆగ్నేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి యోగా ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. యోగా శిక్షకుడు, ఎన్ఎస్ఎస్ పీవో లగుడు ముత్యాలనాయుడు ఆసనాలు, ప్రాణాయాయం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సుజాత, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీతోపాటు అధికారులు యోగాసనాలు వేశారు.

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం కల్చరల్: భారత వికాస్ పరిషత్, టంగుటూరి ప్రకాశం శాఖల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆదర్శ నగర్ పార్కు, వెంకటేశ్వర నగర్ పార్కులో జవహర్ వాకర్స్ క్లబ్, 42వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సరస్వతీ ఘాట్ వద్ద, ప్రకాశ్‌నగర్ రౌండ్ పార్కులో వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్, రెండో వార్డులోని జక్కంపూడి రామ్మోహనరావు కల్యాణ మండపంలో యోగా దినోత్సవం నిర్వహించారు. రాజమహేంద్రి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో యోగా ర్యాలీ చేశారు. జేకే గార్డెన్స్‌లో అఖిల్ యోగా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డేలో కలెక్టర్ ఇతర అధికారులు దాదాపు 150 మంది పాల్గొన్నారు. యోగా టీచర్లు వేణు, సుందరి యోగా భంగిమలు, వాటి వల్ల కలిగే మేలు వివరించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డిల్లీ హోంమినిస్ట్రీ రిటైర్డ్ ఆర్‌జేడీ రాజప్ప అన్నారు. ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రూర్కెలా ప్లాంట్ రిటైర్డ్ జీఎం సుబ్రహ్మణ్యం సూర్యనమస్కారంపై అవగాహన కల్పించారు. యోగా ఎలా ఉపయుక్తమో కేంద్రీయ విద్యాలయం యోగా పీఈటీ చుక్కా మధుసూదన్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో భారత్ వికాస పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ సభ్యులు పీవీఎస్ నారాయణ, ఉన్ని కష్ణన్, గణేష్, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖరరావు, జిటిరావు, రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ గంటి కామాక్షి, యోగా టీచర్ ఉండవల్లి ఉమామహేశ్వరి, సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండర్ జి.సురేష్‌బాబు, డిప్యూటీ కమాండర్ బి.రత్తయ్య,డిప్యూటీ కమాండర్ జగదీష్,డాక్టర్ నితిన్, జవాన్లు, జవాన్ల కుటుంబాల పౌరులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని బాలికోన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవానికి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. యోగా ద్వారా ఆరోగ్యంతో బాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు రామచంద్రారెడ్డిని సత్కరించారు. పాఠశాల విద్యార్థినులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తమలంపూడి సుధాకర రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు తాడి గంగిరెడ్డి పాల్గొన్నారు. జీబీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కోరుకొండ: మండలంలోని 14 హైస్కూల్స్, 54 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లోను యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు పలు ఆసనాలు వేయించారు. కోరుకొండ హైస్కూల్లో ఉపాధ్యాయుడు రాజశేఖర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. మధురుపూడి జడ్పీ హైస్కూల్లో జరిగిన యోగా వేడుకల్లో ఎంఈవో టి.కుశలవదొర, గాడాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 సుజాత పాల్గొన్నారు. కోరుకొండ హరేరామ సమాజం వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరి, టీడీపీ, జనసేన నాయకులు, సర్పంచ్ కర్రి వీరగణేష్ పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు

ధవళేశ్వరం, జూన్ 21: ప్రతిరోజు యోగా చేస్తే పరిపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో నిర్వహించిన యోగా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. యోగా ప్రాముఖ్యతను ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు వివరించారు. నేచురోపతి వైద్యురాలు తాళ్లూరు దివ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఆసనాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, డాక్టర్ అభిషేక్ సుధీర్, అర్జున్ పాల్గొన్నారు. అలాగే పతాంజలి యోగా సమితి, వివేకానంద మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కుసుమ హరినాథబాబా మందిర ప్రాంగణంలో యోగా శిక్షకుడు తలాటం సూర్యప్రకాశరావు యోగాసనాలు వేయించారు. మాజీ సర్పంచ్ పిన్నంటి ఏకబాబు, ఉడతా రంగారావు, ఒంటెద్దు స్వామి యోగా ఆవశ్యకతను వివరించారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు.



ధవళేశ్వరంలో యోగాసనాలు వేస్తున్న డీఎంహెచ్‌వో, సిబ్బంది

పచ్చిరొట్ట ఎరువులతో బహుళ ప్రయోజనాలు

- ఏరువాక శాస్త్రవేత్తలు అమ్మాజీ, హైమజ్యోతి

రాజానగరం, జూన్ 21: పచ్చిరొట్ట ఎరువులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఏరువాక శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమజ్యోతి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కలవచర్లలో దుద్దుపూడి సుధాకర్ క్షేత్రంలో బీపీటీ-2858 చిరు సంచులు, బీపీటీ-2841 రకాలతో ఏర్పాటు చేసిన ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ పంట కాలంలో పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవడం వల్ల నేల భౌతిక రసాయనిక స్థితిగతులు మెరుగుపడి సారవంతమవుతుందన్నారు. నేలలో ఏమైనా ఇతర లోపాలుంటే సవరించబడతాయన్నారు. నేలలు సేంద్రియ పదార్థం పెరుగుతుందని, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. జీవ రసాయనిక చర్యల వల్ల నేలలో సారం పెరిగి ఆరోగ్యవంతమై ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుందన్నారు. భూమిలో రసాయనిక ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి కూడా పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడతాయని, కలుపును ఎక్కువగా పెరగనివ్వకుండా నివారిస్తాయన్నారు. జీలుగా, జనుము, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట ఎరువులు సార్వా పంట కాలంలో సాగు చేసుకుని పంట తొలి పూత దశలో నేలలో కలియదున్నడం వల్ల తర్వాత వేయబోయే వరి పంటకు ఎకరానికి సుమారుగా 20నుంచి 50కిలోల నత్రజని వరకు ఆదా చేసుకోవచ్చని చెప్పారు. అలాగే వంటి పచ్చిరొట్ట ఎరువులు పశువుల మేతగా కూడా ఉపయోగపడతాయన్నారు. ఈవిధంగా బహుళ ప్రయోజనాలున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సాగు చేసి సుస్థిరమైన దిగుబడులను సాధించాలన్నారు. భూసార పరిరక్షణ, దిగుబడిలో స్తబ్ధతను అధిగమించేందుకు రైతులు తప్పనిసరిగా సేంద్రియ ఎరువులను నేలకు అందించాలని పలు సూచనలు, సలహాలు అందించారు.



కలవచర్లలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతుకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

డిప్యూటీ సీఎం పవన్‌కు బత్తుల అభినందన

కోరుకొండ, జూన్ 21: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను శుక్రవారం ఉదయం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని బత్తుల అన్నారు. ఇదిలా ఉండగా కూటమి అభ్యర్థిగా అఖండ విజయం సాధించిన బత్తుల బలరామకృష్ణ శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయన స్వగ్రామం గాదరాడలో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఓం శివశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అన్నసమారాధనలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

మంత్రులకు ఎమ్మెల్యే నల్లమిల్లి శుభాకాంక్షలు

అనపర్తి, జూన్ 21: రాష్ట్ర మంత్రులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్‌లకు శుక్రవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో ఇద్దరు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన నల్లమిల్లి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

యోగాతో మానసికోల్లాసం : ఆళ్ల గోవింద్

రంగంపేట, జూన్ 21: యోగా శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని, అది నిత్యజీవితంలో భాగమైతే సంపూర్ణ ఆరోగ్యం పొందుతామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ అన్నారు. శుక్రవారం రంగంపేటలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పీహెచ్‌సీ వైద్యులు, కూటమి సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. నిత్య జీవితంలో శారీరక, మానసిక ఒత్తిడిని నివారించడానికి యోగా, ధ్యానం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఇషా ఫౌండేషన్ యోగా టీచర్ ఎ.శ్రీనివాసరావు యోగా ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. హైస్కూల్ వ్యాయామోపాధ్యాయిని శైల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరాం, బలిరెడ్డి దుర్గారావు, ఉద్దండ్రావు శ్రీనివాసరావు, వెలుగుబంటి సత్తిబాబు, ఎంఈవో కె.శ్రీనివాసరావు, హెచ్ఎం వి.పార్థసారధి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి శిథిలంపై విచారణ చేపడతాం

రంగంపేట పీహెచ్‌సీలో శిథిలావస్థలో ఉన్న భవనం కూల్చివేతలో ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుపై, సంబంధిత సామగ్రి గోల్‌మాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆళ్ల గోవింద్ అన్నారు. రంగంపేట ప్రభుత్వాసుపత్రిపై వచ్చిన ఫిర్యాదులపె శుక్రవారం ఆయన పీహెచ్‌సీకి వెళ్లి పరిశీలించారు. నిందితులను వదిలిపెట్టబోమని,చర్యలు తీసుకుంటామన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులో ఉద్యోగావకాశాలు మెండు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రాజానగరం, జూన్ 21: పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన వారికి దేశవిదేశాల్లో ఉద్యోగవకాశాలు మెండుగా ఉన్నాయని బొమ్మూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు అన్నారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాలలోని మొదటి ఏడాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్‌వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషిచేయాలన్నారు. అనంతరం ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్ శర్మ, పీజీ రామానుజం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'వీజే' విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

దివాన్‌చెరువు, జూన్ 21: దివాన్‌చెరువులోని వీజే ఫార్మసీ కళాశాల విద్యార్థులు పది మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డి.నరేంద్ర శుక్రవారం తెలిపారు. వీరంతా బి.ఫార్మసీ నాలుగో సంవత్సరం విద్యార్థులని చెప్పారు. ఏపీ సోర్స్ సంస్థ మెడికల్ కోడింగ్‌కి సంబంధించిన ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డి, ఛైర్‌పర్సన్ ఎస్.శకుంతల అభినందించారు.

నాడు-నేడు పాఠశాలలో శిలాఫలకం ధ్వంసం

బిక్కవోలు, జూన్ 21: కొమరిపాలెంలోని ఏపీ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు క్రింద పనులు చేపట్టేందుకు 2022లో వేసిన శిలాఫలకాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. పాఠశాల హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు దళిత ఎమ్మెల్యేల అభినందన సభ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21: దళితులను నమ్మించి ద్రోహం చేసిన జగన్‌ను రాష్ట్రంలోని దళితులంతా ఏకమై గద్దె దింపారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు.ఈ నెల 22న చంద్రబాబు నివాసం ఉండవల్లి కరకట్ట వద్ద మాలమహాసభ నేత మల్లెల వెంకట్రావు, మాల జేఏసీల ఆధ్వర్యంలో చిగురు నవజీవన్ బాలభవన్‌లో ఏర్పాటు చేసిన దళిత ఎమ్మెల్యేల అభినందన సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉండవల్లిలో జరిగే అభినందన సభకు రాష్ట్ర నలుమూలల నుంచి మాల సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే గోరంట్ల చొరవతో

నర్సరీలకు పగటి పూట విద్యుత్

కడియం, జూన్ 21: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవతో నర్సరీ రైతులకు పగటి పూట కరెంట్ వచ్చింది. ఇటీవల ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో లేవనెత్తిన నర్సరీరైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి వచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో నర్సరీలకు రాత్రి సమయంలోను, తెల్లవారు ఝామున ఇచ్చేవారని, తెలుగుదేశం ప్రభుత్వంలో పగటి పూట విద్యుత్ ఇప్పించేలా చేయాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ తదితరులు ఎమ్మెల్యే గోరంట్లను కోరారు. దీంతో ఏఈ రామారావుతో మాట్లాడి నర్సరీలకు పగటి కరెంట్ ఇవ్వాలని, అవసరమైతే సంబంధిత మంత్రితో తాను మాట్లాడతామని గోరంట్ల అన్నారు. దీంతో 48 గంటల్లోనే సమస్యకు పరిష్కారం లభించింది. నర్సరీలకు ఇచ్చే త్రీఫేజ్ కరెంట్ ఉదయం 9గంటల నుంచి ఇస్తామని విద్యుత్‌శాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్లకు నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డైరెక్టర్లు, నర్సరీ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

బిక్కవోలు సంత మార్కెట్

బిక్కవోలు, జూన్ 21: బిక్కవోలులోని సంత మార్కెట్ ఆక్రమణలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని కూటమి నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం వీరు మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మరమ్మతులు లేకుండా నిరుపయోగంగా వున్న షెడ్లను, పలు ఆక్రమణలను గుర్తించారు. అలాగే పలు చోట్ల ఖాళీ బీరు సీసాలు, పగిలిన సీసాలు, అపరిశుభ్రత వాతావరణాన్ని గమనించారు. మార్కెట్‌లోని వ్యాపారస్తులు.. రాత్రులు చాలా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని కూటమి నేతలకు వివరించారు. ఆక్రమణలు, షెడ్ల మరమ్మతులపై పంచాయతీ అధికారులకు, అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు వివరించారు.

వీఆర్ఏ సంఘం రంగంపేట

అధ్యక్షుడిగా సుబ్బారావు

రంగంపేట, జూన్, 21: వీఆర్ఏల సంఘం మండలాధ్యక్షుడిగా ఇండుగుమిల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. మండలంలో 17 గ్రామాల్లో ఉన్న వీఆర్ఏలతో శుక్రవారం రంగంపేటలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కమిలి భీమ రాజు, గౌరవాధ్యక్షుడిగా ఏగి సుందర్రావు, ట్రెజరర్‌గా మురారి రాజీవ్‌గాంధీలను ఎన్నుకున్నారు.

సార్వత్రిక ఎన్నికలు అయిపోయాయి.. గెలిచిన పార్టీ అధికారం చేపట్టింది.. తాజాగా శుక్రవారం ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం కూడా చేశారు. అయితే నాడు ఎన్నికల్లో పనిచేసిన పలువురికి రెమ్యునరేషన్ మాత్రం ఇంకా చెల్లించలేదు.. దీంతో వారంతా ఆందోళనకు దిగుతున్నారు.. శుక్రవారం ఫొటోగ్రాఫర్స్ కలెక్టరేట్‌ను ముట్టడించారు.. కడియం మండలంలో బీఎల్‌వోలు తమ రెమ్యునరేషన్‌ను చెల్లించాలంటూ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఎన్నికల బకాయిలివ్వాలని ధర్నా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 21 : సార్వత్రిక ఎన్నికలు 2024 ముగిసినా రెమ్యునరేషన్ చెల్లించకపోవడంపై కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 248 మంది ఫొటోగ్రాఫర్లు 58 రోజుల పాటు పనిచేశారు. అయితే కొంత మొత్తం చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించాలని ధర్నా చేశారు.దీనిపై స్పందించిన కలెక్టర్ మాధవీలత ఫొటోగ్రాఫర్లకు రావాల్సిన బకాయిలను ఈ నెల 29వ తేదీలోగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో అసోసియేషన్ అధ్యక్షుడు బాబి,సిరి శ్రీను,కోనే శ్రీను, దొమ్మేటి రవికుమార్ పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ ఇప్పించాలని బీఎల్‌వోల వినతి



కడియం, జూన్ 21 : కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న బూత్ లెవెల్ ఆఫీసర్స్(బీఎల్‌వో)ల రెమ్యునరేషన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎల్‌వోలు శుక్రవారం కడియం తహశీల్దార్ బి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నిమిత్తం ఎంతో కష్టించి పనిచేశామని, అయినా రెమ్యునరేషన్ ఇంకా రాలేదని బీఎల్‌వోలు వాపోయారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు కాదంబరి సూర్య శ్రీనివాస్, బండారు మహేష్, తాడాల సత్యనారాయణ, తూఘ్లూరి ప్రశంస, దేగల పాపారాయుడు,సాదే నాగమల్లి, డేనియల్ బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఒక్క డయేరియా కేసు నమోదు కాకూడదు

కలెక్టర్ మాధవీలత



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 21 : జిల్లాలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో అవగాహన కలిగించేందుకు డయేరియాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రెండు వారాల కార్యాచరణ అమలు చేయాల్సి ఉందన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ డయేరియా నియంత్రణపై జిల్లాస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతున్నామన్నారు. డయేరియా కేసులు నమోదు కాకుండా తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ స్థాయి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, డీఐవో డాక్టర్ రాజకుమారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.





ఉపయోగమే!

బం చిక్ బం బం చేయి బాగా.. ఒంటికి యోగా మంచిదేగా.. అవును మరి ఆసనాల్లోనే ఆరోగ్యం.. ఆందోళనగా ఉన్నా.. ఆకలి లేకున్నా.. ఆయాసంగా ఉన్నా.. ఒంట్లో ఏ రోగం ఉన్నా ఆసనంతో సరి.. అందుకే యోగాకు అంత ప్రాముఖ్యత.. ప్రస్తుతం పాఠశాలల్లోనూ యోగా క్లాసులు ప్రత్యేకంగా చెప్పిస్తున్నారంటే ఎంత ఉపయోగమే అర్థం చేసుకోవాల్సిందే.. అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం పండుగలా చేశారు.. విద్యార్థులు.. ఉన్నతాధికారులు.. న్యాయమూర్తులు.. న్యాయవాదులు ఇలా ఒకరేమిటి అన్ని వర్గాలు యోగా బాటపట్టారు.. బిక్కవోలు పాఠశాలలో విద్యార్థులు.. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జేకే గార్డెన్స్‌లో అధికారుల యోగాసనాలు చిత్రాల్లో చూడవచ్చు.

అసెంబ్లీ ఆనందం



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కల ఫలించింది..ఆ ఆనందం మాటల్లో కనిపించింది.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నాయకులు శుక్రవారం అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టారు.ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆయా ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. తెలుగుదేశం- జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం మొదలైన సంగతి తెలిసిందే.రెండు రోజుల పాటు ఇవి జరుగుతాయి. ఈ రెండు రోజులు ప్రొటెం స్పీకర్‌గా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యవహరిస్తున్నారు.ఆయన ఇప్పటి వరకూ ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో సీనియర్‌గా ఆయనకు ప్రొటెం స్పీకర్‌గా గౌరవం దక్కింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తొలి విజయాన్ని కూటమికి అందించి విజేతగా నిలిచిన గోరంట్ల ప్రథమ విజేతగా నిలిచారు. ఇప్పుడు ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ స్థానం అధిరోహించిన బుచ్చయ్యచౌదరికి ఎమ్మెల్యేలంతా అభినందనలు తెలిపారు. శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన 172 మంది ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి వద్దకు వెళ్లి అభివాదం చేశారు. ఆయన కూడా ప్రతి అభివాదం చేశారు. దీంతో మొత్తం ఎమ్మెల్యేలందరితో మాట్లాడే అవకాశం గోరంట్లకు దక్కింది. కొందరు ఆయనకు పాదాభివందనం కూడా చేశారు. కొందరు మహిళలను ఆయన ఆశీర్వదించారు.జిల్లాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా ఉండడం వల్ల బుధవారం ఆయన చేత గవర్నర్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. మిగతా ఆరుగురితో గోరంట్ల చేయించారు.రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాత్రం పవిత్రహృదయంతో అని చెబుతూ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక వీరంతా ఇక ఎమ్మెల్యేలే.. వైసీపీ వాళ్లంతా తాజా మాజీ లైపోయారు. జిల్లాలో కూటమికి చెందిన వారే అందరూ కావడం గమనార్హం. అందులో టీడీపీ తరపున నలుగురు, జనసేన నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఉన్న సంగతి తెలిసిందే. ఇక తమ నియోజకవర్గాలకు వచ్చి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టనున్నారు. నాయకుల ప్రమాణస్వీకారం పూర్తయిన వెంటనే ఆయా నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. చాలా మంది టీవీలలో ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్లలో అభినందనలు తెలుపుతూ పోస్టులు పెట్టారు.

- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- జిల్లా నుంచి ఆరుగురు
- రంపచోడవరం నుంచి ఒకరు
- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- దైవసాక్షిగా అంటూ ప్రమాణం
- ఒకరికొకరు అభినందనలు
- నియోజకవర్గాల్లో సంబరం



అనే నేను

కందుల దుర్గేష్, నిడదవోలు | ఆదిరెడ్డి శ్రీనివాసు, రాజమహేంద్రవరం సిటీ | బత్తుల బలరామకృష్ణ, రాజానగరం | ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు | మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి | మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం

24,25న ఐటీఐ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24,25 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. జీపీఏ 10-7, 1-136 ర్యాంకు విద్యార్థులకు 24న ఉదయం 9 గంటలకు,జీపీఏ 6.8-5.7 ర్యాంకు 137-270 విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు, జీపీఏ 5.7-4.7 ర్యాంకు 271-405 వరకూ జూన్ 25న ఉదయం 9 గంటలకు,జీపీఏ 4.7-1.6, 406-543 ర్యాంకు విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఎలాంటి ఫోన్‌కాల్స్ మెసేజ్‌లు రాని అభ్యర్థులు పదో తరగతి గ్రేడ్ పాయింట్ల ప్రకారం ఆయా తేదీల్లోని నిర్దేశిత సమయాల్లో సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావచ్చని కృష్ణన్ తెలిపారు.



కళాశాలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

కొవ్వూరు, జూన్ 21 : కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జోన్-2 ప్రాంతీయ ఉప సంచాలకులు శోభారాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల అధ్యాపకులతో అకడమిక్‌కు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. అకడమిక్, కార్యాలయానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కళాశాల అభివృద్ధికి సంబంధించి సూచనలు,సలహాలు అందజేశారు.

బూమ్ బూమ్ .. ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్, హార్సెస్, ఓషన్ బ్లూ.. ఇలా రకరకాల పేర్లతో జగన్ గుంపు నాసిరకం మద్యం జనాల ప్రాణాలు తీసింది. మన రాష్ట్రంలో దొరికే మందు దేశంలో మరెక్కడా లభ్యమయ్యేది కాదు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లు అక్కడి నుంచి మద్యం తెచ్చుకొనే పరిస్థితి ఉండేది. దీనికి కారణం 'జే' బ్రాండ్లు. ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్, బూమ్ బూమ్ అంటూ పిచ్చి బ్రాండ్లను పారించారు. ఏది అమ్మితే అదే తాగాలనే దందా సాగింది. మద్యం అలవాటు ఉన్నవారు ఎక్కువగా ఇష్టపడే బ్రాండ్లను ఆపేశారు. అదే సమయంలో ధరలను రెండింతలు పెంచేశారు. ఎంత చెల్లించినా నాణ్యమైన సరుకు గగనమైపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో జే బ్రాండ్లకు బై బై చెబుతున్నారు.. నాణ్యత కలిగిన మద్యం బ్రాండ్లకు జైకొడుతున్నారు.

బై..బై జే బ్రాండ్స్!



జగన్ 'బూమ్ బూమ్'కు బైబై

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మందుబాబులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజులు త్వరలోనే రానున్నాయి.. ఐదేళ్లుగా 'జే' బ్రాండ్లతో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్నారు.. నాణ్యమైన చుక్క పడి ఏన్నాళ్లయ్యిందో. వైసీపీ పెద్దల కమీషన్ల దెబ్బకు ఎంసీ, సియాగ్రామ్స్ వంటి అంతర్జాతీయ కంపెనీలు సైతం కనుచూపు మేరలో కనిపించకుండా పరుగు పెట్టాయి. బడ్వయిజర్, నాకవుట్ వంటి ఆదరణ కలిగిన బీర్లు కనుమరుగయ్యాయి. మద్యం తయారీ కంపెనీలను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని నాసిరకం మద్యాన్ని తయారు చేసి దానిని ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయాలు జరిపేవాళ్లు.వాటిలో ప్రజల ఆరోగ్యాన్ని తినేసే రసాయనాలు ఉన్నాయని గగ్గోలు పెట్టినా జగన్‌కి పట్టింపు లేకుండాపోయింది. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో త్వరలోనే అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి.ఈ మేరకు 'జే' బ్రాండ్ల కొనుగోలును ఏపీఎస్‌బీసీఎల్ ఆపేసిందని తెలుస్తోంది.

మారనున్న మద్యం పాలసీ..

గతంలో టీడీపీ ప్రభుత్వం(2019కి ముందు) ఉన్న సమయంలో మద్యం పాలసీ పద్ధతి ప్రకారం నడిచేది. లైసెన్సు విధానంలో ప్రైవేటు షాపులకు అనుమతులు ఇవ్వడం జరిగేది. మద్యం ఎంఆర్పీ ధరపై వ్యాపారులకు ప్రభుత్వమే 15 శాతం వరకూ చెల్లించేది. దీంతో ఒక్క పైసా అదనంగా తీసుకోడానికి వీలుండేది కాదు. వైసీపీ ప్రభుత్వంలో దానిని రద్దు చేసి.. ఎంతకైనా విక్రయించుకోవచ్చనే వికృత జీవోను విడుదల చేసింది. ప్రభుత్వ మద్యం దుకాణాలంటూ వైసీపీ మద్యం మాఫియాకు ఊతమిచ్చింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పాత విధానాన్నే అమల్లోకి తేవడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తేయబోతున్నారని తెలుస్తోంది.ప్రైవేటు మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయిస్తారనే చర్చ నడుస్తోంది.ఆశావహులు ఆ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నారు.

ఇకనైనా బెల్ట్ తీస్తారా?

మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెంపుపై తీవ్రంగా దృష్టి సారించిన వైసీపీ ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖపై బాగా ఒత్తిడి పెంచింది. తద్వారా జనాలతో పూటుగా నాసిరకం మందు తాగించింది. 19 మండలాల్లో 158 మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్‌ఇన్ స్టోర్స్‌ని తెరపైకి తెచ్చింది. వాటికి బెల్టుషాపులు జతకలిశాయి.టీడీపీ ప్రభుత్వ హయాంలో మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ జగన్ మాత్రం గడప గడపకూ మందు అందాలన్నదే లక్ష్యంగా మద్యం పాలసీ చేశారు. నివాసాల మధ్యనే మద్యం షాపులు పెట్టారు. మద్యం అమ్మకానికి వీలైన ఏ ఒక్క అవకాశాన్నీ జగన్ వదల్లేదు. వీధికో బెల్టుషాపు పుట్టుకొచ్చింది. చివరికి చీప్ లిక్కర్ ధరను అమాంతం రూ.150 చేసేశారు. టీడీపీ హయాంలో నాణ్యమైన చీప్ లిక్కర్ రూ.60కే దొరికేది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బెల్టుషాపులపై యంత్రాంగం బెల్టు తీయనుంది. జగన్ ఆర్భాటంగా తీసుకొచ్చిన (సెబ్)ని కూడా సెట్‌రైట్ చేసి ఎక్సైజ్ శాఖను పూర్తిస్థాయిలో పునరుద్ధరణ చేస్తారని తెలుస్తోంది.

ఉందిలే..మందుకాలం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్జాతీయ కంపెనీలు తయారు చేసే ఎంసీ విస్కీ, బ్రాందీ, ఇపీరియల్ బ్లూ(ఐబీ), ఓసీ ఒరిజినల్, ఏసీ బ్లాక్ ఒరిజినల్,మెన్స్‌క్లబ్, డైరెక్టర్ స్పెషల్(డీఎస్పీ), ఏసీ ప్రీమియం, అరిస్ట్రోక్రాట్ ప్రీమియం, వీఎస్ఓపీ వంటి బ్రాండ్లు అందుబాటలోకి రానున్నాయి. అయితే దీనికి కొద్దిగా సమయం పట్టే అవకాశం ఉంది. అధికారులు, అమాత్యులు, ప్రభుత్వం కుదురుకోవాల్సి ఉంది. ఇంకా కొందరు మంత్రులు బాధ్యతలు స్వీకరించలేదు. అలాగే క్యాబినెట్ సమావేశం జరగలేదు. ఇవన్నీ అయిన తర్వాత ఎక్సైజ్ పాలసీలపై చంద్రబాబు సమీక్ష చేస్తారని చెబు తున్నారు. ప్రస్తుతం ఉన్న బార్లకు అనుమతులు ఇంకా సుమారు ఏడాదిన్నర ఉన్నాయి. ప్రభుత్వం మద్యం షాపుల లైసెన్సు సెప్టెంబరు నెలాఖరు వరకూ ఉంది. దీంతో మద్యం పాలసీలను సమీక్షించాల్సి ఉంది. అయితే దానికంటే ముందే నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కసరత్తు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే తయారీ కేంద్రాల నుంచి పిచ్చి బ్రాండ్ల కొనుగోలు నిలిపివేశారు.జిల్లాలో 137 ప్రభుత్వం మద్యం షాపులు,20 బార్లు ఉన్నాయి. వీటికి రాజమండ్రిలోని ఏపీఎస్‌బీసీఎల్ డిపో నుంచి మద్యం సరఫరా చేస్తారు. అయితే ఈ డిపోకి బూమ్‌బూమ్, బ్లాక్‌బస్టర్ బీర్లు, గోల్డెన్ కింగ్, దారుహౌస్, ఆంధ్రాగోల్డ్, సుప్రీం, లీలా (వైసీపీ విజయ సాయిరెడ్డి కంపెనీ అని చెబుతారు) వంటి బ్రాండ్లను సరఫరా చేయడం ఇప్పటికే నిలిపివేశారు. డిపోలో స్టాకు ఉన్నంత వరకూ దుకాణాలకు పంపిస్తున్నారు. తయారీ కంపెనీల నుంచి కొత్తగా ఈ బ్రాండ్లు డిపోకు రావడం లేదు. అలాగే ధరలపై కూడా పునఃసమీక్ష చేయనున్నారు. చీప్ లిక్కర్ కూడా నాసిరకం పోయి నాణ్యమైనది రానుంది.

- జగన్ బ్రాండ్లకు మంగళం
- డిపోలకు రవాణా నిలిపివేత
- త్వరలో నాణ్యమైన సరుకు
- మళ్లీ అంతర్జాతీయ బ్రాండ్లు
- జిల్లాలో 158 మద్యం దుకాణాలు
- బెల్ట్ షాపుల జోరు
- పాత మద్యం పాలసీ తెచ్చే అవకాశం
- కూటమి ప్రభుత్వ నిర్ణయం
- ప్రైవేటు లైసెన్స్‌లకు ఎదురుచూపులు



కంబాలచెరువులో మృతిచెందిన చేపలు

కంబాలచెరువులో చేపల పెంపకమా!?

పలు రకాల చేపల మృతితో కంపుకొడుతున్న పార్కు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21 : ప్రవేశరుసుంపై ఉన్న శ్రద్ధ.. నిర్వహణపై లేదు..దీంతో రాజమహేంద్రవరం కంబాలచెరువు కంపుకొడుతోంది. సరదాగా సేదతీరడానికి కంబాలచెరువు పార్కుకు వచ్చిన వారి ముక్కులు పగిలేలా దుర్వాసన వస్తోంది. చేపలు గురువారం రాత్రి చనిపోయి నీటిపై తేలి శుక్రవారం ఉదయానికి కంపుకొట్టాయి. కంబాలచెరువులోకి చేపలు ఎలా వచ్చాయో తెలియదు కానీ.. అవి చనిపోయి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కంబాలచెరువులో మురుగునీరే ఉంటుంది.సాధారణంగా దోమలు గుడ్లను తినడానికి గంబూషియా చేప పిల్లలను చెరువులో వేస్తారు. కానీ కంబాలచెరువులో జెల్లలు, ఇతర చేపలు కూడా ఎలా పెరిగాయో అర్థంకాని పరిస్థితిగా ఉంది. కంబాలచెరువు పార్కు నిర్వహణ బాధ్యతలు గత ప్రభుత్వంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు.ప్రజాధనంతో పార్కును అభి వృద్ధి చేసి ఒక్కొక్కరికీ రూ.30ల ప్రవేశ టిక్కెట్టు పెట్టారు. లోపల ఉన్న సైక్లింగ్, సైకిలింగ్,రోలింగ్ వివిధ పరికరాలతో పిల్లలను అలరించే వాటికి ఒక్కొక్క దానికి సపరేటు ధరలు నిర్ణయించారు.డబ్బులపై ఉన్న శ్రద్ధ కంబాలచెరువు నిర్వహణపై లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేపలు పెంచేదెవరు?

కంబాలచెరువులో వేలాదిగా చేపలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ చెరువులోకి ఉంటే గంబూషియా చేపలు ఉండాలి తప్ప చేపలు ఎలా వచ్చాయనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిగా డ్రైనేజీ వాటర్‌తో నిండిన చెరువులోకి చేపలు ఎలా వచ్చాయో నిర్వాహకులకే తెలియాలి. గత ఐదేళ్లుగా కంబాలచెరువులో చేపలను ఎవరికీ తెలియకుండా పెంచుతున్నారా? అనే అనుమానాలున్నాయి. చెరువులో తేలిన చేపల్లో జల్లలు, మోసు, గడ్డి చేపలు ఉండడం గమనార్హం.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పవన్‌కల్యాణ్‌ను కలిసిన టీవీ రామారావు



పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామారావు

కొవ్వూరు, జూన్ 21: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, కుమార్తె దివ్యరాణి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలో తొలిసారి అడుగుపెడుగు పెడుతున్న పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అలాగే పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవును కలసి అభినందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

కొవ్వూరు, జూన్ 21: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని కొవ్వూరు ఎస్‌ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించడం వల్ల అనారోగ్యాల పాలవుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ డి.సత్యకుమారి, అధ్యాపకులు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలి నడకన ద్వారకాతిరుమలకు..



వేంకటేశ్వరుడిని దర్శించుకున్న పవన్ అభిమానులు

పెరవలి, జూన్ 21: సార్వత్రిక ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే కాలి నడకన ద్వారకాతిరుమల వస్తామని తీపర్రుకు చెందిన అభిమానులు మొక్కుకున్నారు. ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించడంతో తీపర్రు నుంచి ద్వారకాతిరుమల వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శంకు శివరామకృష్ణ, స్వాతి, సముద్రాల శేషవేణి, కంటిపూడి భూలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నిడదవోలు, జూన్ 21: నిడదవోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో వేమగిరి పరమహంప యోగానంద నేత్ర వైద్య ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తొలి దశలోనే నేత్ర సమస్యలను గుర్తిస్తే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థుల్లో దృష్టి దోషాలను గుర్తించి వారికి సేవలందించేందుకే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బూరుగుపల్లి సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బీఎస్‌వీ ప్రసాద్, చైన్ల రాజా, కొండేపాటి రామకృష్ణ, ఈదల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుకాణాల్లో లేబర్ అధికారుల తనిఖీలు



దుకాణాల్లో దాడులు నిర్వహించిన లేబర్ అధికారులు, పోలీసులు

తాళ్లపూడి, జూన్ 21: తాళ్లపూడిలోని పలు దుకాణాల్లో లేబర్ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిడదవోలు నుంచి వచ్చిన లేబర్ ఆఫీస్ స్క్వాడ్ ఆఫీసర్ శాంతిరాజు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను దుకాణాల్లో పనిచేయించరాదని, అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో లేబర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ

చాగల్లు, జూన్ 21: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ యడ్లపల్లి ఉమారజని అన్నారు. మండలంలోని నెలటూరులో టీడీపీ నాయకుడు రకారావు పుట్టినరోజును స్థానిక ప్రాథమిక పఠశాలలో విద్యార్థులతో కలిపి జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలుతో పాటు, నోటు పుస్తకాలు, పెన్‌లు, ఇతర సామగ్రి అందజేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పవన్ ఫ్లెక్సీలు చించిన దుండగులను శిక్షించాలి

పోలీసులకు జనసేన గోపాలపురం ఇన్‌చార్జి సువర్ణరాజు వినతి



కృష్ణంపాలెంలో ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు



దుండగుల చించివేసిన పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీ

దేవరపల్లి, జూన్ 21: పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలు చించివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణ రాజు డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణంపాలెం, దేవరపల్లి, యర్నగూడెం గ్రామాల్లో జనసేన నాయకులు, అభిమానులు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ ఫొటోతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కృష్ణంపాలెంలోని ఫ్లెక్సీని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారని వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేసినట్టు సువర్ణరాజు తెలిపారు. ఇటువంటి సంఘటనల దృష్ట్యా ఫ్లెక్సీలు ఉన్న చోట పెట్రోలింగ్ ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని పోలీసులను కోరినట్టు చెప్పారు. ఫ్లెక్సీలు చించినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాట్నం గణేష్, కంబాల సత్తిబాబు కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలు



దేవరపల్లి, జూన్ 21: మండలంలోని కురుకూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలను సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంగల ఆనందరావు, వార్డుసభ్యులు వల్లూరి బాలాజీ, పల్లపు మోహన రావు, కలగర వెంకట్రావు, రామచంద్రరావు, కొయ్యలమూడి జలావతి, కార్యదర్శి ఎన్.రవికిషోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నన్నయ వర్సిటీలో యోగాసనాలు వేస్తున్న వీసీ, అధికారులు, విద్యార్థులు



ఉండ్రాజవరం హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో మానసిక ఆరోగ్యం

- నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య పద్మరాజు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పలుచోట్ల యోగాసనాలు
- యోగా గురువులకు సత్కారాలు



కొవ్వూరు కోర్టు వద్ద యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు

దివాన్‌చెరువు, జూన్ 21: యోగాతో మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిన యోగా వేదకాలం నుంచే భారతదేశంలో ఉందని, యోగా మూలాలన్నీ భారత్‌లోనే ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనతోనే 2015లో ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు రోజూ యోగా చేస్తే మెదడు చురుగ్గా పనిచేస్తుందని, జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నో ప్రయోజనాలున్న యోగను అందరూ ఆచరించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ యోగ ఆసనాలు చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. కానవరంలోని శ్రీరాపర్తిరామ యోగా సంస్థ ఆధ్వర్యంలో వర్శిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో వివిధ యోగా సనాలు వేయించారు. యోగాసనాలతో నిర్వహించిన జలదీప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో యోగా సంస్థ ప్రతినిధులు డీఎస్ఎన్ రాజు, ఎంవీజీఎస్ శర్మ, ఎ.శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్స్ పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, యోగా డిప్లమో విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇన్‌స్ట్రక్టర్ యోగా తరగతులు నిర్వహించి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో 9వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాలాత్రిపుర సుందరి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఏబీఎన్&పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో గౌతమీ యోగా స్రవంతి నిర్వాహకులు కె.వల్లీ, ఎం.కనకదుర్గ, ఎం.నాగసుందరి, బీ ఎస్ కృష్ణమూర్తి, కె.వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగా విశిష్టత, యోగాతో కలిగే శారీరక, మానశిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్ర యోజనాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.ర మేష్ 2023-24 సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నందిగం వెంకటసుబ్బారావు, పీడీ పిల్లి మురళీధర్, డి.వాసంతి, సీహెచ్.బాలాజి పాల్గొన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు ఎం.రామచంద్రరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జరిపారు.

పెరవలి: స్థానిక వశిష్ట పాఠశాలలో కరస్పాండెంట్ ఓలేటి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రంగినీడి గంగాధరరావు, సింహాద్రి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే అజ్జరం నెంబర్-1 పాఠశాలలో హెచ్ఎం ఆర్వో ఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు కాశీ విశ్వనాథం, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని గాంధీనగర్‌లో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. వాకర్స్‌క్లబ్,మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలోని గాయత్రీ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావును సన్మానించారు. అనంతరం యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, రామకృష్ణంరాజు, మారిశెట్టి సత్యనారా యణ, కిల్లాని రమేష్ పాల్గొన్నారు. స్థానిక శ్రీసూర్య స్కూల్లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొని యోగా పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించారు. కలిశెట్టి సన్యాసినాయుడు, ఇందుగుల రామకృష్ణ, అనంతం సాయి పాల్గొన్నారు. గజ్జరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మోహన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా టీచర్‌సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో స్థానిక ప్రాథమిక పాఠశాల, పొగాకు వేలం కేంద్రం, భాష్యం స్కూల్లో పూర్ణ యోగా ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రత్యేక యోగాసనాలు వేయించారు. యోగా సాధకులు గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రతిఒక్కరు దినచర్యలో యోగసాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంతవోలు తిరుమలదాసు, అప్పారావు, వేలం నిర్వహణాధికారి ప్రసాద్, యోగా శిక్షకులు మధుబాబు, పూర్ణయోగ గురువు రామచంద్ర గురూజీ, భాష్యం ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పొగాకు బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం హైస్కూల్లో వ్యాయామోపాధ్యాయులు బీఎస్ స్వామి, ఎమ్ఎన్ పుష్పవల్లి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్ఎం మాణిక్యాలరావు విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతతను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: నెలటూరు శ్రీసీతారామ కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించి చిన్నారులతో ధ్యానం చేయించి, ఆసనాలు వేయించి అవగాహన కల్పించారు. తాళ్లూరి వరప్రసాద్, మద్దిపాటి సురేష్, జుట్ట గణపతి, మన్నే శ్రీను, కాంచన పాల్గొన్నారు. కలవలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయించారు. పలు అభ్యసనాలు నేర్పించారు. హెచ్ఎం జె.శ్రీనివాసరావు, పీఈటీ కొయ్య గంగాధరరావు పాల్గొన్నారు.



పెరవలిలో యోగా కార్యక్రమం



చాగల్లు : నెలటూరులో యోగా చేస్తున్న బాలబాలికలు



నిడదవోలులో యోగా చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



తాళ్లపూడిలో యోగా గురువు వెంకటేశ్వరరావుకు సత్కారం



దేవరపల్లి పొగాకుబోర్డులో యోగాసనాల్లో అధికారులు



యోగాసనం వేసిన పీడీజే గంధం సునీత

జీవన శైలిలో యోగా భాగం కావాలి

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మన జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని, శారీరక మానసిక శ్రేస్సును మెరుగు పరిచే ఒక అభ్యాసం యోగా అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగాసనాలను వేశారు. శారీరక మానసిక ఒత్తిడి నుంచి బయట పడడానికి యోగా ఉపకరిస్తుందన్నారు. యోగాలో పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను యోగా శిక్షకుడు శ్యామ్ వివరించారు. సెంట్రల్ జైలులో అధికారులు, ఖైదీలు యోగాసనాలు వేశారు. ప్రతిరోజూ ఉదయం ఖైదీలు యోగాతో తమ దైనందిన జీవనాన్ని ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగా భారతి ట్రస్టు గురువులు అల్లు సత్యనారాయణ, నవీన.. యోగ, ధ్యానం చేయించిన అనంతరం అష్టాంగ యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజ్‌కుమార్, బి.రత్నరాజు, జైలర్లు కెవీ రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేశ్, సీహెచ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ఆడ శిశువు మృతదేహం

నిడదవోలు రైల్వేస్టేషన్ సమీపంలోని యార్డ్ వద్ద లభ్యం



నిడదవోలు, జూన్ 21: పుట్టి పదిహేను రోజులైనా నిండని శిశువు మృతదేహం అనుమానాస్పదంగా రైలు పట్టాలపై ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఎవరైనా కఠినాత్ములు ఆడపిల్ల పుట్టిం దని రైలు పట్టాలపై వదిలేసారా లేక చనిపోయిన ఆడ శిశువును తెచ్చి పట్టాలపై వదిలేసారా అనేది ఆ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. నిడదవోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న యార్డ్ వద్ద శుక్రవారం రైలు పట్టాలపై పదిహేను రోజుల్లోపు వయసున్న గుర్తుతెలియని ఆడ శిశువు మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు గుర్తించారు. మృత శిశువును పసుపు, తెలుపు బొమ్మల డిజైన్ ఉన్న బేబీ కేరింగ్ కవర్‌లో ఉంచారని ఎరుపురంగు చున్నీ చుట్టూ చుట్టి ఉందని, పింక్ కలర్ జుబ్బా వేసి ఉందని చెప్పారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ మృత శిశువును గుర్తించిన వారు 94906 17090, 7013360296 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

దుద్దుకూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



దుద్దుకూరులో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

దేవరపల్లి, జూన్ 21: దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు, మేధావులపై కేంద్ర ప్రభుత్వం నల్లచట్టాలు ప్రయోగించి సంబంధంలేని రాష్ట్రంలో కూడా తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందని ప్రగతిశీల కార్మిక సంఘం సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ అన్నారు. మండలంలోని దుద్దుకూరులో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని శుక్రవారం ఆందోళన నిర్వ హించారు. మస్తాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, ప్రజాసంఘాల నాయకులపై ఎన్ఐఏ దాడులు ఆపాల న్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలు, మావోయిస్టులపై జరుగుతున్న మారణహో మం ఆపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ప్రసాదరావు, కార్తీక్, సతీష్, సూర్యప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఉరేసుకున్నాడు..?



ఉరి పోసుకున్న రాజశేఖర్

కొవ్వూరు, జూన్ 21: కొవ్వూరులో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కట్టుంగ రాజశేఖర్(27) స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురుగా, గౌతమీనగర్‌లో ఉన్న ఓ ఇంట్లో ఉంటూ ఆటోడ్రైవర్, ఫంక్షన్లకు డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో దూలానికి చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్ణ అనే వ్యక్తి గమనించి గోపాలపురం మండలం బీమోలు గ్రామంలో ఉంటున్న మృతుడి అక్క, బావలకు ఫోన్‌లో సమాచారం అందించారు. బావ శంకవరపు శ్రీను ఇంటికి వచ్చి చూసే సరికి రాజశేఖర్ ఇంట్లో చీరతో ఉరి పోసుకుని ఉన్నాడు. కాగా రాజశేఖర్ అల్లర, చిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడని, మద్యం తాగిన మైకంలో గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడని, మానసిక స్థితి సరిగాలేక ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

ఉండ్రాజవరం, జూన్ 21: మండలంలోని కె.సావరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తణుకు మైత్రి లయన్స్ క్లబ్ మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడే విధంగా 40మందికి స్టీల్ ప్లేటులు, గ్లాసులు శుక్రవారం అందజేసింది. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడిన ఐదుగురిపై కేసు

కొవ్వూరు, జూన్ 21: పాతకక్షల నేపథ్యంలో దౌర్జన్యంగా ఇంటిపైకి వచ్చి ఇద్దరు వ్యక్తులను దుర్భాషలాడి కొట్టిన సంఘటనలో ఐదుగురిపై కేసునమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎమ్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన కాకి రాజశేఖర్‌కు వారా రాజీవ్‌కుమార్‌కు పాత గొడవలున్నాయి. పెద్దల్లో రెండుసార్లు పంచాయితీ పెట్టారు. అది మనసులో పెట్టుకుని రాజీవ్‌కుమార్, కంఠ జగదీష్, అక్కాబత్తుల శేఖర్, వారా రాజ్‌కుమార్, వారా రాజు శుక్రవారం రాజశేఖర్ ఇంటిపైకి దౌర్జన్యంగా వెళ్లి రాజశేఖర్‌ను, సోదరుడు కాకి విజయరాజును దుర్భాషలాడి కొట్టారు. కాళ్లతో తన్నారు. దీంతో రాజశేఖర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నేటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉండ్రాజవరం, జూన్ 21: ఉండ్రాజవరంలో వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈనెల 22నుంచి 26వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఐదురోజులూ పూజలు, అభిషేకాలు జరుపుతామన్నారు. 26న అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల చొరవతో

నర్సరీలకు పగటి పూట విద్యుత్

కడియం, జూన్ 21: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవతో నర్సరీ రైతులకు పగటి పూట కరెంట్ వచ్చింది. ఇటీవల ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో లేవనెత్తిన నర్సరీరైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి వచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో నర్సరీలకు రాత్రి సమయంలోను, తెల్లవారు ఝామున ఇచ్చేవారని, తెలుగుదేశం ప్రభుత్వంలో పగటి పూట విద్యుత్ ఇప్పించేలా చేయాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ తదితరులు ఎమ్మెల్యే గోరంట్లను కోరారు. దీంతో ఏఈ రామారావుతో మాట్లాడి నర్సరీలకు పగటి కరెంట్ ఇవ్వాలని, అవసరమైతే సంబంధిత మంత్రితో తాను మాట్లాడతామని గోరంట్ల అన్నారు. దీంతో 48 గంటల్లోనే సమస్యకు పరిష్కారం లభించింది. నర్సరీలకు ఇచ్చే త్రీఫేజ్ కరెంట్ ఉదయం 9గంటల నుంచి ఇస్తామని విద్యుత్‌శాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్లకు నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డైరెక్టర్లు, నర్సరీ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

బిక్కవోలు సంత మార్కెట్

మార్కెట్‌ను సందర్శించిన కూటమి నేతలు

బిక్కవోలు, జూన్ 21: బిక్కవోలులోని సంత మార్కెట్ ఆక్రమణలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని కూటమి నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం వీరు మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మరమ్మతులు లేకుండా నిరుపయోగంగా వున్న షెడ్లను, పలు ఆక్రమణలను గుర్తించారు. అలాగే పలు చోట్ల ఖాళీ బీరు సీసాలు, పగిలిన సీసాలు, అపరిశుభ్రత వాతావరణాన్ని గమనించారు. మార్కెట్‌లోని వ్యాపారస్తులు.. రాత్రులు చాలా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని కూటమి నేతలకు వివరించారు. ఆక్రమణలు, షెడ్ల మరమ్మతులపై పంచాయతీ అధికారులకు, అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు వారు వివరించారు.

నేడు మాల ఎమ్మెల్యేల

అభినందన సభ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21: దళితులను నమ్మించి ద్రోహం చేసిన జగన్‌ను రాష్ట్రంలోని దళితులంతా ఏకమై గద్దే దింపారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు.ఈ నెల 22న చంద్రబాబు నివాసం ఉండవల్లి కరకట్ట వద్ద మాలమహాసభ నేత మల్లెల వెంకట్రావు, మాల జేఏసీల ఆధ్వర్యంలో చిగురు నవజీవన్ బాలభవన్‌లో ఏర్పాటు చేసిన మాల ఎమ్మెల్యేల అభినందన సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉండవల్లిలో జరిగే అభినందన సభకు రాష్ట్ర నలుమూలల నుంచి మాలసోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు.